తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
01 జూలై 2026
పేజీలు : 8



## ప్రభుత్వం కుమ్మరుల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

○కుమ్మర కులవృత్తులకు బ్యాంకు రుణాలు, ప్రత్యేక సబ్సిడీలు అందించాలి

○రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏరుకొండ వెంకటేశం



**కొండమల్లేపల్లి, జూన్ 30 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం సాయికృప ఫంక్షన్ హాల్లో కొండమల్లేపల్లిలో దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి కిరణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, గ్రామాల నుంచి కుమ్మర వృత్తిదారులు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘం బలోపేతం వృత్తిదారుల సమస్యలు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏరుకొండ వెంకటేశం మాట్లాడుతూ కుమ్మర వృత్తి నేటి పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రభుత్వ పరంగా ప్రత్యేక గుర్తింపు ఉపాధి అవకాశాలు బ్యాంకు రుణాలు మట్టి కుంటల పరిరక్షణ ఆధునిక యంత్ర పరికరాల సబ్సిడీ శిక్షణా కార్యక్రమాలు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కుమ్మర వృత్తికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాజ్గిరి దయానంద్ మాట్లాడుతూ సభ్యులందరూ ఐక్యంగా ఉండి వృత్తి పరిరక్షణ, హక్కుల సాధన కోసం సమిష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కుమ్మర సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామంలో సంఘాన్ని విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించారు. సభలో సంఘం బలోపేతానికి పలు కీలక తీర్మానాలు ఆమోదించడంతో పాటు రాబోయే రోజుల్లో కుమ్మర వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులను ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు. సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి సభ్యుడికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు నాగపూరి నాగేష్, ఎగిరిశెట్టి వీరయ్య, నిమ్మలూరి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా నాయకులు ఆడాల గణేష్, ఎగిరిశెట్టి బాలరాజు, నల్గొండ జిల్లా కన్వీనర్ రధరపు బిక్షపతి, కో కన్వీనర్ గంగాధర్ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కామిశెట్టి శ్రీనివాస్ నిదానం పెల్లి వెంకటస్వామి, కంచర్ల రాము చిట్టిమల్ల ఆంజనేయులు, బత్తుల కృష్ణయ్య , ఆమంచి వెంకన్న, జిల్లా మహిళా కన్వీనర్ ఎగిరిశెట్టి అనిత, సాగర్ నియోజకవర్గం కన్వీనర్ ఏలిజాల వెంకన్న, మునుగోడు నియోజకవర్గం కన్వీనర్, సిలువేరు సత్తయ్య, నల్గొండ నియోజకవర్గం కన్వీనర్, నిమ్మనగోటి శాంప్రసాద్, జిల్లా నాయకులు దేవరకొండ నియోజకవర్గ ప్రతినిధులు కొండమల్లేపల్లి మండల కన్వీనర్ ఏరుకొండ రాము, గుడిపల్లి కన్వీనర్ గణపురం వెంకటేశ్వర్లు, గుండ్లపల్లి డిండి బొడ్డుపల్లి లక్ష్మయ్య, గ్రామ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కుమ్మర వృత్తిదారులు పాల్గొన్నారు.



## విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతు భరోసా నిధులు : కలెక్టర్ అంకిత్

### 10,400 మంది రైతులకు రూ.19.44 కోట్ల రైతు భరోసా నిధులు



**ములకలపల్లి జనంసాక్షి :**
మండలం లోని 10,400 మంది రైతులకి రూ.19 కోట్ల 44 లక్షల రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు తెలియజేసారు. మండలంలోని ములకలపల్లి, పూసుగూడెం మరియు జగన్నాధపురం రైతు వేదికలలో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగిందని అయన తెలిపారు. ఈ సందర్భంగా జగన్నాధపురం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొనడం జరిగింది. రైతు భరోసా నిధులు రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకి సహాయ పడుతుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వి బాబు రావు, జిల్లా ఉద్యా నవన అధికారి కిషోర్, సర్పంచులు కుంజా వినోద్, కల్లూరి కిషోర్ , సోడే చైతన్య, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొనడం జరిగింది.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ తనిఖీ



**హాలియా, జూన్ 30 జనం సాక్షి:**
నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు ఎన్నికల నమోదు అధికారి జై శ్రీనివాస్ మంగళవారం హాలియా మున్సిపాలిటీతో పాటు అనుముల మండలంలోని మిగతా 8లో



## బూర్గంపహాడ్ లో భారీగా గంజాయి పట్టివేత

**బూర్గంపహాడ్ జూన్ 30 (జనంసాక్షి) :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 525 కిలోల గంజాయి మంగళవారం భారీగా పట్టుబడింది. తెలంగాణ రాష్ట్ర ఈగల్ ఫోర్స్ ఇటీవల జరిపిన మెరుపు దాడుల్లో భారీగా గంజాయి పట్టుబడింది. తాజా ఘటనల్లో స్థానిక మండలం సారపాక వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు జరిగిన ఆపరేషన్లలో సుమారు రూ. 1 కోటి విలువైన 200 కిలోల గంజాయిని పట్టుకుని ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశారు. అత్యంత వేగంగా, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ఈగల్ ఫోర్స్.. సారపాక దాడిలో కంటైనర్ ద్వారా అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి నిల్వలను ఈగల్ ఫోర్స్, పోలీసులు సారపాకలో పట్టుకున్నారు.

**ఒడిశా - తెలంగాణ సరిహద్దు ఆపరేషన్:**
ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా తరలిస్తున్న సుమారు రూ. 2.5 కోట్ల విలువైన 500 కిలోల గంజాయిని పోలీసులు, ఈగల్ ఫోర్స్ అధికారులు 80 కిలోమీటర్ల మేర ఛేజ్ చేసి మరీ స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర రాకెట్ ఛేదం: అంతర్రాష్ట్ర గంజాయి సరఫరాను అడ్డుకునే క్రమంలో సుమారు రూ. 1 కోటి విలువైన 200 కిలోల గంజాయిని పట్టుకుని, ఐదుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు.

## క్రీడా మైదానంలో మట్టి కుప్పలు..!

○అధ్వానంగా మారిన యువత ఆటస్థలం

○మట్టి గుట్టలతో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో ఆటలకు అంతరాయం

○చర్యలు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 30 (జనంసాక్షి):** మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న క్రీడా మైదానం ప్రస్తుతం మట్టి కుప్పలతో నిండిపోయి యువతకు ఉపయోగపడని పరిస్థితికి చేరిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ మైదానం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైందని వారు ఆరోపిస్తున్నారు. అయితే ఇటీవల సీతారామ ప్రాజెక్టు రైట్ కెనాల్ పనులకు సంబంధించిన మట్టిని మైదానంలోనే పోయడంతో ఆటలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని చెబుతున్నారు. మట్టి గుట్టల కారణంగా క్రికెట్, వాలీబాల్‌తో పాటు కబడ్డీ, కోకో, టెన్నిస్ వంటి క్రీడలను నిర్వహించడం కష్టంగా మారిందని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కనిపించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. క్రీడా మైదానాన్ని ఆక్రమించిన మట్టి కుప్పలను వెంటనే తొలగించి, మైదానాన్ని తిరిగి ఆటలకు అనువుగా తీర్చిదిద్దాలని వారు కోరుతున్నారు. ప్రజాధనంతో అభివృద్ధి చేసిన క్రీడా వసతులు నిర్లక్ష్యానికి గురికాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, యువతకు మళ్లీ క్రీడలకు అనుకూల వాతావరణం కల్పించాలని గ్రామ ప్రజలు, క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.






# వైద్యుల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యం

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మనోహర్

యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 30 (జనంసాక్షి) ప్రజల ప్రాణాలను కాపాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యులు పోషిస్తున్న పాత్ర ఎంతో గొప్పదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం. మనోహర్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా డా. ఎం. మనోహర్ గారు మాట్లాడుతూ వైద్య వృత్తి అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, మానవాళి ప్రాణాలను కాపాడే అత్యంత పవిత్రమైన సేవా వృత్తి అని అన్నారు. వైద్యులు తమ విజ్ఞానం, అనుభవం, నైపుణ్యం, కరుణ, అంకితభావంతో ప్రతి రోగికి ఆరోగ్యాన్ని, నమ్మకాన్ని, కొత్త జీవితాన్ని అందిస్తూ సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా, అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధుల ప్రబలిన సందర్భాలు, కోవిడ్ మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం తమ వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టి ప్రజల ప్రాణాల రక్షణ కోసం అహర్నిశలు సేవలందిస్తున్న వైద్యుల సేవలు సమాజానికి చిరస్మరణీయమని కొనియాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే, సమగ్ర వైద్య సేవలను అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 1 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 4 బస్తీ దవాఖానాలు, 99 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 23 ఆయుష్ డిస్పెన్సరీలు, 1 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా




బీబీనగర్ లోని ఎయిమ్స్ ద్వారా అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### జూలై ఐదు టి.ఆర్.పి మహాసభను విజయవంతం చేయాలి

**భువనగిరి సభతో తెలంగాణ దద్దరిల్లాలి**

**టిఆర్పి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్**

భువనగిరి, జూన్ 30 (జనంసాక్షి) భువనగిరిలో జూలై 5న నిర్వహించనున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఐదు టి.ఆర్.పి మహాసభను విజయవంతం చేసి పార్టీ బలాన్ని రాష్ట్రవ్యాప్తంగా చాటాలని ఐదు టి.ఆర్.పి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలో పలువురు బీసీ ప్రముఖులకు మహాసభ ఆహ్వాన పత్రికలను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.జూలై 5న భువనగిరి వేదికగా జరిగే ఈ మహాసభ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాజ్యాధికార లక్ష్యాన్ని ప్రతిబింబించే చారిత్రాత్మక సభగా నిలవాలని ఆయన అన్నారు. ఈ సభతో తెలంగాణ దద్దరిల్లేలా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీకి ప్రజలంతా అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



### నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు

సూర్యాపేట(జనంసాక్షి): విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలందించే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని టీజీఎస్ ఆర్టీసీ సూర్యాపేట డిపో మేనేజర్ సునీత అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగ విరమణ పొందిన ఏడీసీ ఎం.ఏ.రజాక్, కండక్టర్లు ఎండీ.మునీర్, ఎం.ఎస్.రావు, డ్రైవర్ ఎస్.శ్రీనివాసులుకు ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ సుదీర్ఘ విధుల నిర్వహణ కాలంలో సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు.వారి సేవలు ఆర్టీసీకి ఆదర్శప్రాయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఎంసీ రవి,సుంకరి శ్రీనివాస్, శంకరయ్య,ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

బీబీనగర్ (జనంసాక్షి): బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గ్రామానికి చెందిన బోయపల్లి శంకర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు గోవర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డిలు మంగళవారం నోట్ బుక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ సొంత గ్రామంలోని విద్యార్థులకు సహకారం అందిస్తున్న బోయపల్లి దయాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని, విద్యార్థులకు సహకారం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాన సత్యనారాయణ, వార్డు సభ్యుల అశ్విని బాలరాజు గౌడ్, అరుణ సత్యం గౌడ్, లావణ్య రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# దేవరకొండలో జోరుగా జొన్న రొట్టెల అమ్మకం

**స్వయం ఉపాధితో కుటుంబ ఆదాయాన్ని పెంచుకుంటున్న మహిళలు**

**రోజురోజుకూ పెరుగుతున్న అమ్మకాలు**

**డిమాండ్ పెరగడంతో అనేక మందికి ఉపాధిగా మారిన జొన్న రొట్టెల విక్రయం**




దేవరకొండ, జూన్ 30( జనంసాక్షి) ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనతో జొన్న రొట్టెలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. దేవరకొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో జొన్న రొట్టెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాయంత్రం వేళల్లో ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో ముఖ్యంగా మహిళలు జొన్న రొట్టెలను తయారు చేసి విక్రయిస్తూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.జొన్న రొట్టెలు పోషక విలువలు అధికంగా ఉండటంతో పాటు మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలను నియంత్రించడంలో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో యువత నుంచి వృద్ధుల వరకు వీటిని ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. సిరిధాన్యాలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనతో జొన్న రొట్టెల తయారీ ఎంతోమందికి ఉపాధి మార్గంగా మారుతోంది.ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సిరిధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే మరింత మంది యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ఆరోగ్యకరమైన ఆహారంపై పెరుగుతున్న ఆసక్తితో జొన్న రొట్టెల వ్యాపారానికి మంచి భవిష్యత్తు ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# బస్వాపురం నిర్వాసితులకు న్యాయం చేయాలి

**(R&R) నిధుల విడుదల, పిలాయిపల్లి డంపింగ్ యార్డు తొలగింపుపై సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కుంభం వినతి**

**సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. త్వరలోనే నిధుల విడుదలకు హామీ**



భువనగిరి, జూన్ 30 (జనంసాక్షి) బస్వాపురం ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం, పునర్నిర్మాణం (R&R) ప్యాకేజీ కింద పెండింగ్‌లో ఉన్న పరిహార నిధులను తక్షణమే విడుదల చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే, పరిహారం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితుల ఇబ్బందులను వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, పెండింగ్ నిధులను త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.అలాగే రంగారెడ్డి జిల్లా బండరావిరాల వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రభావం పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామ శివారుపై తీవ్రంగా పడుతోందని, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఆ డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.



## సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 30 (జనంసాక్షి)**

బస్వాపురం ప్రాజెక్టుతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పెండింగ్‌లో ఉన్న పరిహార నిధులను తక్షణమే విడుదల చేసి, నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే రంగారెడ్డి జిల్లా బండ రావిరాల వద్ద ఉన్న డంపింగ్ యార్డు ప్రభావం పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామ శివారుపై పడుతున్నందున, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.



## ఓటర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ

### పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సమస్యలపై చర్చ?

**చింతపల్లి, జూన్ 30(జనంసాక్షి)**

చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి అధ్యక్షతన గ్రామ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలోని పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు తదితర ప్రజా సమస్యలపై పాలకవర్గ సభ్యులు, సంబంధిత అధికారులు విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం గ్రామంలోని 44, 45 నంబర్ పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ ఎన్యూమరేషన్ పత్రాలను గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి , బీఎల్‌వోల తో కలిసి ఓటు హక్కు కలిగిన ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ పత్రంలో తమ వివరాలను పూర్తిగా, కచ్చితంగా నమోదు చేయాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌వో దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని సూచించారు. "ఓటు మన హక్కు? ఆ హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత" అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, వార్డు సభ్యులు, గ్రామ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుమారెడ్డి , డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి,గొంది జైపాల్ రెడ్డి ,యాదవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజం

**సూర్యాపేట (జనంసాక్షి):**

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజమని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సూర్యాపేట ఆర్డీఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ బాల్నే అంజయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలందించే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. సుదీర్ఘకాలం సేవలు అందించిన అంజయ్యను అభినందించారు.ఉద్యోగ విరమణ అనంతర జీవితం సుఖశాంతులతో కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం అంజయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు తహశీల్దార్లు, అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వానకాలం రైతు భరోసా తో పాటు యాసంగి బకాయిలు చెల్లించాలి

**తుంగతుర్తి జూన్ 30 (జనంసాక్షి)**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన యాసంగి రైతు భరోసా బకాయిలు వెంటనే చెల్లించాలి అని మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు, మంగళవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగి లో 45రోజుల్లో రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని చెప్పి కేవలం రెండు ఎకరాల వరకే రైతు భరోసా నిధులు విడుదల చేసి మిగతా ఎగొట్టడం జరిగిందన్నారు. మళ్ళీ ఇప్పుడు వానకాలం రైతు భరోసా నిధులు ఇస్తామని గొప్ప గొప్ప ప్రకటన లు చేస్తే నమ్మే పరిస్థితి లో రైతాంగం లేరని అన్నారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు, ఇదేమని ప్రశ్నిస్తే కేవలం ప్రతిపక్ష పార్టీ నాయకులను తిడుతూ రెండున్నర ఏండ్లుగా కాలం వెళ్ళబుచ్చుతు న్నారని విమర్శించారు ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి యాసంగి రైతు భరోసా బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు గుండగాని రాములు గౌడ్. మండల నాయకులు మల్యాల రాములు. తడకమళ్ల రవి కుమార్.మట్టిపెల్లి వెంకట్ పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్. నాయకులు బొజ్జ సాయికిరణ్. కొండగడుపుల వెంకటేష్. తడకమళ్ల మల్లికార్జున్.తదితరులు పాల్గొన్నారు.



## ఆటోలో పోగొట్టుకున్న బంగారం పుస్తె బాధితురాలికి అప్పగింత

### -పట్టణ ఎస్ఐ : చలికంటి నరేష్

హుజూర్‌నగర్, (జనంసాక్షి): పట్టణంలోని సిసి కెమెరాల నిఘా సహాయంతో మహిళ పోగొట్టుకున్న బంగారు పుస్తె ను భద్రంగా బాధితురాలికి అందజేసినట్లు హుజూర్ నగర్ పట్టణ ఎస్సై చలి కంటి నరేష్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 12:00 గంటల సమయంలో పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వైష్ణవి మట్టపల్లి బైపాస్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఒక లోకల్ ఆటో ఎక్కారు. ఆమె పాత బస్టాండ్ వద్ద దిగిపోయిన తర్వాత, తన బంగారు పుస్తె ఆటోలోనే జారిపోయినట్లు, గ్రహించిన బాధితురాలు వెంటనే హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎస్ఐ చలికంటి నరేష్ పట్టణంలోని సీసీ కెమెరాల పుటేజీ లను క్షుణ్ణంగా పరిశీలించి, సదరు మహిళ ప్రయాణించిన ఆటోను అత్యంత చాకచక్యంగా గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్ కు పిలిపించి, ఆటోను తనిఖీ చేయగా అందులో పుస్తె లభ్యమైంది. రికవరీ చేసిన బంగారు పుస్తెను పోలీసులు, ఆటో డ్రైవర్ అలవాల మంగయ్య సమక్షంలో బాధితురాలికి అందజేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, అతి తక్కువ సమయంలోనే తను పోగొట్టుకున్న పుస్తె ను తిరిగి ఇప్పించినందుకు బాధితురాలు వైష్ణవి హుజూర్‌నగర్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈకి వినతి

### గుమ్మడవల్లి గ్రామ ఉపసర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్

**కొండమల్లేపల్లి, జూన్ 30 (జనంసాక్షి):**

కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో గత ఆరు నెలల నుండి విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఓల్టేజ్ చాలా తక్కువగా ఉండటం వల్ల ఫ్యాన్లు, మోటార్లు సరిగా పనిచేయడం లేదని ఉపసర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ యువకులతో కలిసి మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ దేవోజికి వినతి పత్రం అందించారు. అనంతరం ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామంలో మంజూరైన నూతన విద్యుత్ స్తంభాలు త్వరగా ఏర్పాటు చేయాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వర్షాలకు, ఎండలకు దెబ్బతిన్న విద్యుత్ వైర్లను సరి చేయాలన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పదేపదే కరెంటు పోతుందని దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు పగలు, రాత్రి నిరంతరం వెలుగుతున్నందున ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలపై ఏఈ దేవోజీ సానుకూలంగా స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏఈ హామీ ఇచ్చినట్లు ఉపసర్పంచ్ తెలిపారు.



## చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### ఎస్సై క్రాంతి కుమార్

**తుంగతుర్తి, జూన్ 30,(జనంసాక్షి)**

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి ఎస్సై క్రాంతి కుమార్ స్పష్టం చేశారు."పౌర హక్కుల దినోత్సవం" (సివిల్ రైట్స్ డే) సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో తుంగతుర్తి పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై క్రాంతికుమార్ మాట్లాడుతూ...గతంలో ఉన్న కుల వివక్షత ప్రస్తుతం కొంత తగ్గినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కనిపిస్తున్న అసమానతలు, అంటరానితనం పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. కుల వివక్ష నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ కోసం పోలీసు శాఖ రెవెన్యూ శాఖతో సమన్వయంగా ఈ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి చట్టాల అమలు విధానం, హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన కల్పించడం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, దళితుల భూవివాదాలు, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కులం పేరుతో ఎవరినైనా దూషించడం, వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, సమాజంలో శాంతి, ఐకమత్యం నెలకొల్పేందుకు కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుంచాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి ఎంతో పవిత్రం వైద్యులు ప్రాణదాతలు

## 24 గంటలు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు : డాక్టర్ భరత్ సింగ్ ఎంబిబిఎస్ ఎండి

**కొండమల్లేపల్లి, జూన్ 30 (జనంసాక్షి):**

**కుల మతాలకతీతంగా పేద ధనికులు అనే తేడాలేకుండా ప్రతి మనిషికీ వైద్యం చేసే వైద్యులు కనిపించే దేవుళ్లు. తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను కాపాడాలని తాపత్రయపడే డాక్టర్లు మన మధ్యన ఉండే సైనికులు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం శత్రువులతో కోట్లాడే జవాన్ల మాదిరిగా ప్రతినిత్యం ప్రజల ప్రాణాలను హరించివేసే రకరకాల వ్యాధులను తరిమేసేందుకు నిరంతరం యుద్ధం చేస్తున్నది వైద్యులు. వారికంటూ నిర్వహించే ఓ ప్రత్యేక దినం జాతీయ వైద్యుల దినోత్సవం. వైద్యుల కృషిని త్యాగాలను గుర్తించేలా వైద్యులందరినీ గౌరవిద్దాం.**

వైద్యో నారాయణో హరి అంటారు ప్రాణం పోసే వాడు దేవుడైతే ప్రాణాలను నిలబెట్టే వారు వైద్యులు వైద్యులను దేవుళ్లతో సమానంగా పూజిస్తారు అందుకే వైద్యో నారాయణో హరి అనే సామెత చిరస్థాయిగా నిలిచిందని జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ భరత్ సింగ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వృత్తుల కెల్లా వైద్య వృత్తి పవిత్రమైనదని మానవీయ సేవ యొక్క కృషిని గుర్తించుట లక్ష్యంగా ప్రతి సంవత్సరం జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నాం అని అన్నారు భారతదేశంలో మొదటిసారిగా 1991 నుండి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుతున్నారని దేశం కోసం, రోగుల కోసం 81 సంవత్సరాలుగా గొప్ప సేవలందించి వైద్య రంగానికి విశేష కృషి చేసిన డాక్టర్ బి.సి.రాయ్ జయంతిని జాతీయ వైద్యుల దినోత్సవం గా జరుపుకుంటున్నామని అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన డాక్టర్ బి.సి రాయ్ గొప్ప వైద్యులు అని ప్రఖ్యాత విద్యావేత్త, స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బి.సి.రాయ్ బెంగాల్ ప్రెసిడెన్సీలోని బీహార్ రాష్ట్ర పాట్నా జిల్లాలోని బ్యాంకిపూర్‌లో ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, కలకత్తా 1882 జులై 1వ తేదీన జన్మించారు. తండ్రి ప్రకాష్ చంద్రరాయ్, తల్లి అఘోర్ కామినీ దేవి పాట్నాలో ప్రాథమిక విద్య, ఉన్నత విద్య పూర్తయిన అనంతరం 1909 లో ఇంగ్లాండ్‌కు వెళ్లి లండన్‌లో సెయింట్ సెయింట్ బార్త్ మెవ్ కాలేజీలో ఎంఆర్సిపి ఎఫ్ఆర్సిఎస్ అదే మెడికల్ డిగ్రీలను ఏకకాలంలో పూర్తిచేసి 1911 లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కలకత్తాలోని మెడికల్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. 1911 లో కలకత్తాలో వైద్యవృత్తిని ప్రారంభించారు. 1922-28 మధ్య కాలంలో కలకత్తా మెడికల్ జర్నల్‌కు సంపాదకత్వం బాధ్యతలు నిర్వహించారు.

భగ్న ప్రేమికుడు.. వైద్యమే జీవితంగా మల్చుకుని వైద్య వృత్తిని నమ్ముకుని పేద ప్రజలకు సేవ చేస్తునే జాదవ్ పూర్ టీబి ఆస్పత్రి, కమలనెహ్రూ ఆసుపత్రి, విక్టోరియా ఇనిస్ట్యూట్, చిత్తరంజన్ దాస్ క్యాన్సర్ హాస్పిటల్, ఆర్జిబార్ మెడికల్ కాలేజీని స్థాపించిన గొప్ప వ్యక్తి. అలాగే మహిళల కోసం, పిల్లల కోసం ప్రత్యేకంగా 1926లో చిత్తరంజన్ సేవాదళ్ అనే వైద్యశాలను ఏర్పాటు చేశారు. మహిళల కోసం నర్సింగ్ శిక్షణ కళాశాలలో కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించారు. డాక్టర్ బి.సి.రాయ్ 1925 లో రాజకీయ రంగ ప్రవేశం చేసి పశ్చిమ బెంగాల్లోని బరాక్ పూర్ నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. తర్వాత 1928 లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో సభ్యుడయ్యారు. బీసీ రాయ్ గాంధీ నాయకత్వంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న రోజుల్లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీజీ పిలుపు మేరకు పశ్చిమ బెంగాల్ లో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. కలకత్తాలోని కార్పొరేషన్‌కు 1931 నుండి 1933 వరకు ఆరవ మేయర్‌గా ఉన్నారని కలకత్తా నగరం పారిశుధ్యం లోపించి అనేక సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో తీర్చిదిద్దారు కలకత్తా లోని పురాతన వైద్యుడు నీల్రాతన్ సర్కారు కూతురు కళ్యానిని ఇష్టపడ్డాడు కానీ వారి కుటుంబం తిరస్కరించడం వల్ల వివాహం చేసుకోలేదు కానీ కళ్యాణి జ్ఞాపకార్థం పశ్చిమబెంగాల్లోని ఒక పట్టణానికి కళ్యాణి అనే నామకరణం చేశాడు. 1942 నుంచి 44 వరకు కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా ఎన్నికైనారు 1943 లో ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు అధ్యక్షుడైనారు

**వైద్యుడు, మేయర్, ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి బీసీ రాయ్**

మహాత్మా గాంధీ సూచన మేరకు బెంగాల్‌లో ఉన్న పరిస్థితులను బట్టి 1948 నుండి 1962 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి ప్రజల మన్ననలను పొందాడు. దేశ చరిత్రలో ఒక సాధారణ వైద్యుడు మేయర్‌గా, శాసనసభ్య నిగా, ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏకైక వ్యక్తి బీసీ రాయ్‌అని చెప్పవచ్చు అన్నారు వైద్య వృత్తికే కాకుండా ప్రజా సేవకు అంకితమైన తన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం తన జయంతిని జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రకటించింది. తన జ్ఞాపక శక్తిని శాశ్వతం చేయడానికి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1962లో నేషనల్ అవార్డు ఫండ్‌ను స్థాపించింది. మెడికల్ రంగంలో వివిధ శాఖలలో ప్రత్యేక అభివృద్ధి ప్రోత్సహించడంలో ప్రతిభను గుర్తించుటకు డాక్టర్ బి.సి.రాయ్ పేరుమీద 1976లో నేషనల్ అవార్డును స్థాపించారన్నారు

భారత ప్రభుత్వం 1961 ఫిబ్రవరి 4న భారత అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్న బిరుదుతో సత్కరించింది జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని వైద్యులు అందించే విలువైన సంరక్షణ గురించి తెలుసుకోవడానికి ఈ వేడుకలు దోహదపడతాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాలు, వర్క్ షాపులు, రోగులకు పండ్లు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైద్య సేవలకు గుర్తుగా రోగులు కూడా వైద్యులకు పుష్పగుచ్ఛాలు ఇవ్వడం, గ్రీటింగ్ కార్డులు, బహుమతులు ఇచ్చి సత్కరిస్తారు.

వైద్యులకు సమాజం సహకరించాలి

డాక్టర్ బి.సి.రాయ్ మరణించేంత వరకు ప్రజాసేవలో ఉంటూ 1962 జులై 1 న పరమపదించారు. తన పుట్టినరోజు,






వర్ధంతిని ఒకే రోజున జరుపుకోవడం యాదృచ్ఛికం. కోవిద్ 19, కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో మన కంటికి కనిపించని వైరస్‌తో పోరాటం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వైద్యుల సేవలు గొప్పవి. ప్రాచీనకాలంనకు ఇప్పటికే పోల్చినట్లయితే వైద్యరంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రక రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. అయినా కూడా మార్పులు కనుగుణంగా వైద్యులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలందిస్తున్నారు.

కరోనా వైరస్‌తో జరుగుతున్న పోరాటంలో వైద్యులు తమ ఇంటికి కుటుంబాల కంటే ఆసుపత్రులకే ప్రాధాన్యమిచ్చారు. కొన్నిచోట్ల వైద్యులు, వైద్య సిబ్బంది కూడా వైరస్ బారిన పడి చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. అయినా కూడా వారు నిరంతరం రోగులకు సేవలు చేస్తున్న సందర్భంలో కూడా అక్కడ అక్కడక్కడ రోగులకు సంబంధించిన బంధువులు హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నారు. అందుకే ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకొచ్చింది. వైద్యులు చేసే సేవలు అనన్యమైనవి, అమోఘమైనవి. వారికి ఈ సందర్భంగా సమాజమంతా సహకరిస్తూ వారిని అభినందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ భరత్ సింగ్ అన్నారు. వైద్య వృత్తిని నమ్ముకుని పేద ప్రజలకు సేవ చేస్తునే మానవత్వాన్ని చాటుకుంటున్నారు డాక్టర్ భరత్ సింగ్. కొండమల్లేపల్లి మండలంలో మారుమూల ప్రాంతాల ప్రజలు సూపర్ స్పెషాలిటీ కార్పొరేట్ ఆసుపత్రులలో వేలల్లో లక్షలు వృధా ఖర్చులు చేయకుండా కొండమల్లేపల్లి మండలంలో పేద మధ్య తరగతి మారుమూల ప్రాంతాల ప్రజలు జైరాం హాస్పిటల్ అండ్ డయాగ్నటిక్ సెంటర్ లో అధిక షుగర్ సమస్యలు, థైరాయిడ్, విష జ్వరములు, డెంగ్యూ, మలేరియా, మూర్ఛ వ్యాధి, పాయిజనింగ్ కేసులు, ఆయాసం, ఉబ్బసం, కామెర్లు, ఊపిరితిత్తులు నిమ్ము పట్టడం, దీర్ఘకాలిక దగ్గు, తేలు, పాము కాటులు, గ్యాస్ ట్రబుల్, జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, చాతి ఇన్ఫెక్షన్లు, అధిక కొలెస్ట్రాల్, నిమోనియాల జ్వరం, గుండె కాలేయం సంబంధిత సమస్యలు, పక్షవాతం, మూతి వంకర, టీబీ, కుష్టు వ్యాధి, బోధకాలు, ఇలాంటి అన్ని రకాల అలర్జీలు, రుతుక్రమ సమస్యలు, జనన పూర్వ కన్సల్టేషన్ లాంటి అన్ని రకాల రోగాలకు మానవతా దృక్పథంతో అప్డేట్ టెక్నాలజీలతో చికిత్సలు చేయబడునని ఇలాంటి అవకాశాలను మారుమూల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొండమల్లేపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో అవగాహన, అర్హతలేని, టెస్టులు చేయకుండానే మందులు ఇచ్చే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. జైరాం హాస్పిటల్ లో రోగులకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని అధునాతన టెక్నాలజీతో అన్ని రకాల రోగాలకు చికిత్సలు చేయబడునని పేద మధ్యతరగతి అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలుపుతూ ఆరోగ్య విషయాలలో వైద్యుల సూచనలు పాటిస్తూ వైద్యులకు సహకరించాలని తెలిపారు. అనంతరం ప్రపంచ వ్యాప్తంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లకు, వైద్య సిబ్బందికి, డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంఈఓ సేవలు అభినందనీయం

**నాంపల్లి,జూన్ 30 (జనంసాక్షి)**

నాంపల్లి మండల విద్యాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న మల్లికార్జునరావు సేవల అభినందనీయమని ముష్టిపల్లి హై స్కూల్ హెడ్ మాస్టర్ రమాదేవి, ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం నాంపల్లి మండల పరిషత్ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన సభలో పాల్గొని శాలువా మెమొంటోతో సన్మానించి మాట్లాడుతూ మండలంలో పాఠశాల బలోపేతానికి,విద్యార్థుల క్రమశిక్షణ,సమయపాలన , ప్రైవేటు పాఠశాలకు పోటీగా మార్కులు సాధించడానికి ఎంఈవో చాలా కృషి చేశారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ ముష్టిపల్లి హెడ్మాస్టర్ శ్రీధర్ రెడ్డి, ముష్టిపల్లి హై స్కూల్ స్కూల్ అసిస్టెంట్స్ వీరయ్య, దామోదరాచారి , దేవత్ పల్లి ఎల్ ఎఫ్ ఎల్ హెడ్మాస్టర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.





## దాతలు సహకారంతో సిమెంట్ బల్లాలు ఏర్పాటు

**నేరేడుచర్ల (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలో ఏడో వార్డు, ఎనిమిదో వార్డులో 16 సిమెంట్ బల్లాలను 44800 రూపాయలు విలువ గల బల్లాలను ప్రధాన కూడలిలో జనాలు కూర్చోవడానికి సౌకర్యంగా ఉండా లని ఏడవ వార్డు కౌన్సిలర్ వాస జ్యోతి శేఖర్ సహకారంతో శివనేని విజయ్ తండ్రి శివనేని రామ నరసయ్య జ్ఞాపకార్థము, దేవులపల్లి వెంకట రమణమ్మ , సహకారంతో వారి భర్త దేవులపల్లి వెంకటాచారి జ్ఞాపకార్థం, బోల్లెద్దు నాగరాజు తల్లి బోల్లెద్దు రాములమ్మ జ్ఞాప కార్థము, పొగబత్తిని శేఖర్ తండ్రి పోకబత్తిని లక్ష్మయ్య జ్ఞాపకార్థము, వీరందరి ఆర్థిక సహకారంతో ఏడు, ఎనిమిది వార్డులలో సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేశారు.

## కళ్యాణలక్ష్మి...షాదీ ముబారక్ చెక్ ల పంపిణీ



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు అందించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పేదింటి మహిళలు సద్వినియోగపరుచుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్ పహాడ్,సూర్యాపేట మున్సిపాలిటీ రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ. 1,50,17,400 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. ఈ పథకాలను ప్రతి ఒక్క పేదింటి మహిళ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ..

**సంస్థాన్ నారాయణపురం. జూన్ 30. (జనంసాక్షి):** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కోతులాపురం పొట్ట మౌనిక,చిమిర్యాల విజయ్ కుమార్, రామచంద్ర రెడ్డి,చిల్లాపురం కావలి మధు, లబ్దిదారులకు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరట నిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్,సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే శరణ్యం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం..



**సంస్థాన్ నారాయణపురం.జూన్ 30 (జనంసాక్షి ):** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటిసత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే శరణ్యమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో మమేకమై ప్రజా పోరాటాల నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా కృషి చేయాలని మాట్లాడారు. శివన్నగూడ ప్రాజెక్టును పనులను వేగవంతం చేసి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గ రైతాంగానికి తాగునీరు కాంగ్రెస్ సహాయం లోని అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసి ప్రజాసంఘాల నిర్మాణం కోసం సంఘటితంగా ఉద్యమిస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పార్టీ ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పొట్ట శంకరయ్య, పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య లు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్య యాదవ్

**సూర్యాపేట (జనంసాక్షి):** రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్, ఫార్మసీ తదితర కళాశాలల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ లు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పై చదువులు, ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల కొరకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయకపోవడంతో పరిశోధనలు ఆగిపోయాయని అన్నారు. పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలను వారం రోజుల్లో విడుదల చేయాలని కోరారు.విద్యారంగానికి బడ్జెట్ లో కేటాయింపులు పెంచాలని, యూనివర్సిటీలకు స్వయంప్రతిపత్తి కల్పించి నిధులు విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రాజబోయిన సుమన్ , ప్రధాన కార్యదర్శి పరాల సాయి , బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి సతీష్ , మంద శివ కుమార్, లోకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





# గిరిజన ప్రాంతంలో క్యాన్సర్ నిర్ధారణ శిభిరాలకు చర్యలు చేపడతాం

### రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు డా. ఎస్ఎల్ కాంతారావు

**భద్రాచలం జూన్ 30 (జనంసాక్షి)** భద్రాచలం ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో క్యాన్సర్ నిర్ధారణ కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు అన్నారు. భద్రాచలం లో మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు ఆఫీసర్'గా జాతీయ గౌరవం – గుర్తింపు పొందిన ఐటీడీఏ పీవో బి రాహుల్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన అంధత్వ నివారణ, కేన్సర్ నివారణ శిబిరాలను నిర్వహించుటకు ఐటీడీఏ సహకారం వలనే 2500 మందికి కంటి ఆపరేషన్లు, 400 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వలన అందరికీ కంటి చూపు మెరుగుపడిందన్నారు. అలాగే పాల్వంచలో రెడ్ క్రాస్ సంస్థ భవన నిర్మాణానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అందులో ఉచిత కేన్సర్ నిర్ధారణ, ఉచిత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని దీని వలన గిరిజన సంక్షేమం, వైద్య సదుపాయాలు విస్తృతపరచాలని కోరగా, ప్రాజెక్టు ఆఫీసర్ రాల్ వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని తెలపగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి, డా. భాను ప్రసాద్, కె అబ్రహం, గాదె మాధవరెడి, చావా లక్ష్మీనారాయణ, డాక్టర్ పి రాజశేఖర్, వై సూర్యనారాయణ, జి రాజారెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ప్రతి ఎకరానికి నీరు అందజేయడమే లక్ష్యం



**సూర్యాపేట (జనంసాక్షి):** ప్రతి ఎకరానికి నీరు అందజేయడమే లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.సోమవారం సూర్యాపేట మండలం రత్నాపురం ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామని తెలిపారు.మూసీ ఆయకట్టు కింద పొలాలకు రెండు పర్యాయాలుగా నీరందిస్తామన్నారు. వానాకాలంలో ప్రాజెక్టు కింద 35 వేల ఎకరాల మేర సాగు నీరందుతుందని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో కురిసిన వర్షంతో మూసీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు చేరిందన్నారు.ప్రస్తుతం మూసీ ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీరుందని తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయలతో ఎడమ కాల్వల మరమ్మతుల పనులు,క్రస్ట్‌గేట్లు ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు.మూసి ప్రాజెక్టు ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.ఎలాంటి ఆటంకాలు ఎదురైనా అధిగమించి మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయాలన్నది సీఎం రేవంత్ రెడ్డి కల అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు



## విలేఖరికి ఆర్థిక సహాయం అందజేత

**బీబీనగర్ (జనంసాక్షి):** మండల పరిధిలోని రహీంఖాన్ గూడెం గ్రామానికి చెందిన విలేఖరి మంచాల అనిల్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో మంగళవారం స్థానిక విలేకరులు మహమ్మద్ షానూర్, సంకూరి మహిపాల్, బక్కన్న నరసింహ పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## బైక్ పైనుండి పడి ఒకరు మృతి, మరొకరికి గాయాలు



**వలిగొండ, జూన్ 30 (జనం సాక్షి )** ప్రమాద వశాత్తు బైక్ పై నుండి పడి ఒకరు మృతి మరొకరికి గాయాలు అయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని టేకులసోమారం కు చెందిన బొల్లారం గణేష్ (25)వృత్తి రీత్యా కారు మెకానిక్ తన బంధువు అయిన భాను ప్రకాష్ తో కలిసి సోమవారం సాయంత్రం తండ్రి నెల మాసికం కొరకు సరుకులు తేవడానికి వలిగొండకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మాందాపురం స్టేజి సమీపంలో గుంతలో పడి కింద పడిపోయారు. గణేష్ తలకు తీవ్ర గాయాలు, భాను ప్రకాష్ కు గాయాలు అయ్యాయి. వారిని వైద్యం నిమిత్తం స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా గణేష్ మృతి చెందాడు.కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ మంగళవారం తెలిపారు.

# విబిజి రామ్ జీ బిల్లును ఉపసంహరించాలి

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 30 (జనంసాక్షి)**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రామ్ జీ బిల్లును తక్షణమే ఉపసంహరించుకుని, పాత ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ పిలుపులో భాగంగానే మండల కేంద్రాల్లో జరుగుతున్న నిరసనలలో తప్పనిసరిగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కార్యకర్తలు, నాయకులు ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలకు ఉపాధి దొరకొద్దనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. నేడు 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం నిధులు కేటాయించాలని చట్టం చేయడం అన్యాయం అని, ఇప్పటికే రాష్ట్రాలలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితుల్లో డబ్బులు కేటాయించకుండా ఉంటే కేంద్రం నుంచి నిధులు ఇవ్వకపోతే నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటిదాకా దళితులు, గిరిజనులు, పేదలు ఉపాధి హామీ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారని, నేడు పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతుందని ఆయన విమర్శించారు. విబిజి రామ్ జీ బిల్లు వల్ల సామాన్య ప్రజలు, రైతులు, పేద వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గౌరవించి వి బి జి రాంజీ పథకాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1వ తేదీన మూడు సంఘాల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమానికి కెవిపిఎస్ మద్దతు తెలుపుతున్నదని, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు.



## కార్మికుల సహజ మరణానికి 5 లక్షలు ఇవ్వాలి - సిఐటియు డిమాండ్

**ములకలపల్లి జూలై 1 జనంసాక్షి :**
వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ సమస్యల పై రాష్ట్ర వ్యాప్తంగా తాహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా లో బాగంగా మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి తాహశీల్ధార్ స్వాతి బిందు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వెల్ఫేర్ బోర్డు స్కీములు బిల్డింగ్ వర్కర్స్ కాకుండా ఇతర వ్యక్తులు ఎక్కువ శాతం మంది వినియోగించు కుంటున్నారని అధికారులు తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి 5 లక్షల భీమా సౌకర్యం పెంచాలని డిమాండ్ చేశారు. 55 సంత్సరాలు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 6000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న క్లైములకు నిధులు వెంటనే విడుదల చేయాలని,



ఇండ్లు లేని కార్మికులకు ఇండ్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) మండల అధ్యక్ష కార్యదర్శులు సూరం పుల్లారావు, ఓరుగంటి శ్రీను, మండల నాయకులు హలావత్ శివ, పోక్కిలి దానియేలు, ఎస్కే మాస్తాన్, సంగు శ్రీను, మోట వెంకటేశ్వర్లు, భూక్యా బద్రు, గుర్రం అశోక్, మడివి మల్లేష్, మందా శ్రీను, కొడిమే వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమంపై కాంగ్రెస్ సమీక్ష సమావేశం

**చంద్రుగొండ, జూన్ 30 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నల్లమోతు వెంకటరమణ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్వోలు అందించే దరఖాస్తు ఫారాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని, బీఎల్ఏలు, గ్రామ శాఖ అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో అప్రమత్తంగా పనిచేసి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల ఎస్ఐఆర్ ఇన్చార్జ్ మేడ రాజుల దిలీప్, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యుడు బుంగ శ్రీనివాసరావు, బీఎల్ఏలు కడియాల పుల్లయ్య, చాపలమడుగు మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి..**

**అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్..**



**దమ్మపేట జూన్ 30 (జనంసాక్షి):**
రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూరియా యాప్ ను రద్దు చేయాలని,కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వం వారికి అన్ని అవకాశాలు కల్పించాలని, దమ్మపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ,అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు పండూరి వీరబాబు లు మాట్లాడుతూ,ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్న రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు పరిపూర్తిగా లభించడం లేదన్నారు.అరకొరగా కురిసిన వర్షానికి విత్తనాలు మొలవక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వర్షాభావ పరిస్థితులవలన వర్షాలు ఆలస్యం వల్ల ఖరీఫ్ కూడా ఆలస్యంగా ప్రారంభమైందని అన్నారు.రైతులు యూరియా యాప్ ద్వారా యూరియా,డిఏపి,కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందటం లేదన్నారు.వీరి కి అవసరమైన మేరకు ఎరువులను పెట్టుబడికై బ్యాంకు రుణాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం విత్తనాలు,ఎరువులు,యూరియా,డిఏపి తో పాటు కాంప్లెక్స్ ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం పెంచిన యూరియా డిఏపి కాంప్లెక్స్ దారులను తగ్గించి సబ్సిడీలను కొనసాగించాలని కోరారు.రైతాంగానికి ఇచ్చిన టువంటి హామీల ప్రకారంగా పంటలకు మద్దతు ధరలు చట్టం చేయాలని,రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, పంట కొనుగోలు పరిమితులను విధిస్తే రైతులు నష్టపోతారన్నారు. అదే విధంగా ఖరీఫ్ రైతు భరోసా సకాలంలో ఇవ్వవలసిన ప్రభుత్వం నేటికీ విడుదల చేయలేదన్నారు ఒకే దఫాలో రైతు భరోసా చెల్లించాలని,గత బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గతంలో వరి పంటలు అమ్మిన రైతాంగానికి వరి కొనుగోలు చేసిన బిల్లులు బోనస్ అన్నిటిని చెల్లించడం లేదన్నారు కొన్నిచోట్ల చెల్లింపులు జరిగిన జాప్యం జరుగుతున్నాయని బకాయిలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల అధ్యక్షుడు కుంజా కాంతా రావు,మండల నాయకులు పూజల సంజీవరావు, భద్రం, జగన్, రాంబాబు,గంగాధర నాగమణి, నాగరాజు,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసిన సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

**● సర్పంచ్ సొంత ఖర్చు లతో ప్రతి బుధవారం విద్యార్థులకు చికెన్ తో కూడిన భోజనం పెడతానని హామీ**

**● సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థిని, విద్యార్థులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు**

**పి.ఏ.పల్లి/గుడిపల్లి, జూన్ 30(జనంసాక్షి ):**
గుడిపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థిని,విద్యార్థులతో కలిసి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం తన సొంత ఖర్చులతో విద్యార్థినీ, విద్యార్థులకు చికెన్ తో కూడిన భోజనం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.సర్పంచ్ హామీ ఇవ్వడంతో విద్యార్థిని,విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు.పాఠశాల ఉపాధ్యాయులు కూడా సర్పంచ్ దాతృత్వానికి ఫిదా అయ్యారు.ఇలా మరెన్నో పాఠశాలలో ఉమ్మడి మండలంలోని సర్పంచ్లు ఇలా చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ప్రోత్సాహకాలతో పామాయిల్ సాగుతో లాభాలు

## మాజీ ఎంపీపీ మాలోత్ లక్ష్మి

**చంద్రుగొండ, జూన్ 30 (జనంసాక్షి):**
వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతు కుటుంబం పామాయిల్ సాగు వైపు అడుగులు వేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచింది. చంద్రుగొండ మండలంలోని మంగయ్య బంజర గ్రామంలో మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మి, గ్రామ సర్పంచ్ మాలోతు గోపాల్ కృష్ణ, రైతు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాలోతు భోజ్య నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి పామాయిల్ మొక్కలను నాటి సాగుకు శ్రీకారం చుట్టారు.ఈ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా మిర్చి, పత్తి, వరి వంటి పంటలను సాగు చేస్తూ వ్యవసాయ రంగంలో మంచి గుర్తింపు పొందింది. ప్రస్తుతం మార్కెట్‌లో పామాయిల్‌కు పెరుగుతున్న డిమాండ్, మెరుగైన ఆదాయ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ సాగును ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు మొక్కలు, సబ్సిడీలు, సాంకేతిక సలహాలు, శిక్షణ కార్యక్రమాలు వంటి పలు రకాల సహాయాన్ని అందిస్తోంది. రైతులు ఈ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పామాయిల్ సాగు చేపడితే దీర్ఘకాలికంగా అధిక దిగుబడితో పాటు స్థిరమైన ఆదాయాన్ని



పొందవచ్చని వారు తెలిపారు.వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా లాభదాయకమైన పంటల సాగు వైపు రైతులు అడుగులు వేయాలని, సంప్రదాయ పంటలతో పాటు పామాయిల్ వంటి వాణిజ్య పంటలను కూడా సాగు చేసి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. మంగయ్య బంజరలో ప్రారంభమైన ఈ పామాయిల్ సాగు మండలంలోని ఇతర రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ప్రయివేటు వైద్యులు చేతులెత్తేసినా.. ప్రభుత్వ వైద్యులు ప్రాణం పోసారు
### స్వయంగా శస్త్ర చికిత్స నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం



భద్రాచలం జూన్ 30 (జనంసాక్షి)

భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో 60శాతం కాలిన గాయాలతో ప్రాణపాయ స్థితిలో వైద్యశాలకు వచ్చిన యువకుడికి శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణపాయ స్థితి నుంచి కాపాడిన సంఘటన ఇది. శస్త్ర చికిత్సను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దగ్గరుండి వైద్యులతో కలిసి నిర్వహించారు. వెంకటాపురం మండలం, సుదిబాక గ్రామానికి చెందిన యువకుడు మడప భాస్కర్ విద్యుత్ షాక్ కు గురై శరీరంలో సుమారు 60 శాతం వరకు తీవ్ర కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ప్రాణాలు కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు హైదరాబాద్ లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించగా, సుమారు రూ.20 నుండి రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబం చికిత్స కోసం తమ పొలాలను కూడా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక చికిత్స కొనసాగించే స్తోమత లేక తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే- ఎంఎస్ డాక్టర్ తెల్లం వెంకటరావుని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, రోగిని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో జనరల్ సర్జన్ అందుబాటులో లేని పరిస్థితుల్లో, స్వయంగా జనరల్ సర్జన్ అయిన ఎమ్మెల్యే నాలుగు నుంచి ఐదు గంటలపాటు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ బి. దేవరాజ్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ తాటి మల్లేష్, డాక్టర్ నికిత, డాక్టర్ కౌండిన్య, నర్సింగ్ సిబ్బంది, అనస్థీషియా బృందం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమిష్టిగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి క్లిష్టమైన కేసుకు ఎమ్మెల్యే స్వయంగా శస్త్రచికిత్స చేయడం అభినందనీయమని, ఆయన సేవాభావం ప్రభుత్వ వైద్య సేవల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వైటీసీ ద్వారా శిక్షణ యువత సద్వినియోగం చేసుకోవాలి
### ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు



భద్రాచలం జూన్ 30 (జనంసాక్షి)

నిరుద్యోగులైన గిరిజన యువతి యువకులు జీవితంలో స్థిరపడటానికి వై టి సి ద్వారా అందించే శిక్షణలను యువత సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు సర్ సెంటర్ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను యువతీ యువకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుద్యోగ గిరిజన యువతి యువకులు పై చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వైటిసిలో అందిస్తున్న వివిధ రకాల శిక్షణలను యువత సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ప్రస్తుతం డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలర్, సిఆర్ఎమ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులతోపాటు రేపటినుండి మిషన్ టైలరింగ్, కంప్యూటర్ అలాగే బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభమవుతాయని ఉత్సాహవంతులైన గిరిజన యువతి యువకులు వారం రోజులలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయనన్నారు.

## సింగరేణి అధికారులు కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియాలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు టీబీజీకేఎస్ సంఘీభావంకాపు కృష్ణ
### ప్రధాన కార్యదర్శి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం జనంసాక్షి : డివిజన్ ఉపాధ్యక్షులు గడప రాజయ్య తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష శిబిరాలను సందర్శించి, సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కాపు కృష్ణ, రాకేష్ రెడ్డి గారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో అధికారులకు ఇచ్చిన ప్రయోజనాలు, కాంగ్రెస్ హయాంలో అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, అధ్యాపకులు, మహిళలు, విద్యార్థులు, అసంఘటిత కార్మికుల తో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసగించింది. కాంగ్రెస్ దుష్ట పాలన, అవినీతి చర్యలను మానుకోవాలని అధికారులు అడుగుతున్న న్యాయమైన కోరికలు తీర్చాలని పిఆర్పి ని వెంటనే ఇవ్వాలని, పే అప్గ్రేడేషన్ చేయాలనీ, సింగరేణి జెన్కో నుండి రావాల్సిన షుమారు 56 వేల కోట్లు ఉంటేనే చెల్లించాలని సింగరేణి కాపాడాలని అన్నారు. సింగరేణిలో మొదటిసారి అధికారులు ర్యాలీలు చేయడం నిరాహార దీక్ష చేయడం ఇదే మొదటి సారి అని ఇప్పటివరకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అన్నారు. అధికారులు కార్మికులు మంచిగుంటేనే సింగరేణి సంస్థ మనుగడ ఉంటుందని వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. ఈ యొక్క సంఘీభావ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వాసికార్ల కిరణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్,రవి వర్మ,బ్రాంచ్ కార్యదర్శి శివ,పిట్ కార్యదర్శులు, వెంకటేష్,సూరజ్ మరియు మోయ సూర్యనారాయణ, జయపాల్ ,బ్రాంచ్ కార్యదర్శి విద్య సాగర్, రాజకుమార్, రంజిత్, రాములు,వినయ్,ఖాజా,హైమద్, గౌరీ, రాజయ్య,మరియు కార్పొరేట్ ఏరియా,కొత్తగూడెం ఏరియా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియోకార్యక్రమం
### ఆరోగ్యశాఖ అధికారి డి. రామారావు



ఖమ్మం కార్పొరేషన్, జూన్ 30 ( జనంసాక్షి)

ఖమ్మం జిల్లాలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు.కార్యక్రమం తొలి రోజు నిర్వహించిన పోలియో బూత్ లో పోలియో చుక్కలు వేయటం లో జిల్లాలోని 1,25,322 మంది 0?5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం లక్ష్యంగా ఉన్న 1,31,642 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,50,774 ఇండ్లను ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 298 ఇళ్లు ఎక్స్ మార్క్ ఇండ్లు, గా గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ ఇళ్లలో అందుబాటులో లేని చిన్నారులను యు ఐ పి లో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం లు తిరిగి పోలియో చుక్కలు వేయడంతో పాటు, ఆయా ఎక్స్ మార్క్ లను పూర్తిగా తొలగించే చర్యలు చేపడతారని వెల్లడించారు.జిల్లాలో మొత్తం 1,31,642 మంది చిన్నారుల లక్ష్యానికి గాను 99.3 శాతం మేర పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన అర్హులైన చిన్నారులను కూడా త్వరితగతిన గుర్తించి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు తమ చిన్నారు లకు పోలియో చుక్కలు వేయించేందుకు సహకరించిన తల్లిదండ్రులందరికీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే యు. ఐ. పి. లో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని, పిల్లలకు నిర్దేశిత సమయానికి అన్ని టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రిటైర్మెంట్ కార్మికులకు ఐఎన్‌టియుసి సన్మానం



బూర్గంపహాడ్ జూన్ 30 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ కర్మాగారంలో ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో అవిశ్రాంతంగా పనిచేసి, తమ సంస్థ అభివృద్ధికి, కార్మిక శ్రేయస్సుకు తోడ్పడిన కప్పెర వెంకట రమణ రావు, జి చంద్రశేఖర్ రావు, ఎస్ సువర్ణ రాజు నేడు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారి వారి డిపార్ట్‌మెంట్లలో వారికి ఐఎన్టియుసి మిత్రపక్షాల ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మీరు అందించిన విలువైన సేవలు, మీ అనుభవం, క్రమశిక్షణ మా అందరికీ ఎల్లప్పుడూ ఆదర్శనీయమని, మీ సుదీర్ఘ ప్రయాణంలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు సంస్థ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఉద్యోగ బాధ్యతల నుండి మీరు విరమణ పొందుతున్నప్పటికీ, మీతో మాకున్న అనుబంధం, గౌరవం ఎప్పటికీ ఇలాగే ఉంటాయన్నారు. రాబోయే కాలంలో మీరు మీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా, ఆయురారోగ్యాలతో, సంతోషకరమైన జీవితాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. మీ పదవీ విరమణ తర్వాతి జీవితం మరెన్నో తీపి జ్ఞాపకాలతో, మానసిక ఉల్లాసంతో ఉండాలని కో?రుకుంటూ వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## సబ్‌కలెక్టర్ ఆదేశాలతో ఇందిరనగర్‌లో పారిశుద్ధ్య పనులు



భద్రాచలం జూన్ 30 (జనంసాక్షి)

భద్రాచలం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను డ్రైనేజీల పూడికతీతతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించి కాలనీలు మొత్తం శు భ్రంగా ఉండేలా చూడాలని భద్రాచలం సబ్ కలెక్టర్ ఆదేశించడంతో అధికార యంత్రాంగం కదిలింది. సోమవారం రాత్రి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బిఎల్ఓలు, సూపర్వైజర్లు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించడానికి వెళ్లిన క్రమంలో కాలనీవాసులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే విద్యుత్ శాఖ వారికి, గ్రామపంచాయతీ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం విద్యుత్ అధికారులు విద్యుత్ తీగలు, గ్రామపంచాయతీ సిబ్బంది డ్రైనేజీ లోని పూడికతీత అలాగే చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందన్నారు. భద్రాచలం పట్టణంలోని ఇతర కాలనీల ప్రజలు శానిటేషన్ పరంగా, విద్యుత్ తీగల పరంగా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకొని రావాలని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి గోపాలకృష్ణ, బి ఎల్ వో, సూపర్వైజరుల పాల్గొన్నారు.


# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

## ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)

## జూన్ 25 నుంచి జూలై 24 వరకు..

### మీ ఓటర్ కార్డు లో సర్ ద్వారా తప్పులను సవరించుకోవాలి..



**మణుగూరు, జూన్ 30 (జనంసాక్షి):**
ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) దేశంలోని ఓటర్ల జాబితా సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా ఈ ప్రక్రియ చేపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. జూలై 24 కు ముగియనుంది. ఎనుమురేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. అందుకు సంబంధించిన టి షర్ట్,టోపీ,పవర్ బ్యాంక్, రెయిన్ కోట్ సామాగ్రిని మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ సర్వే ముఖ్య ఉద్దేశం నకిలీ ఓటర్ల మరణించిన వారు వేరే ప్రాంతాలకు వెళ్లినవారు ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు అదే సమయంలో కలిగి ఉన్న ప్రతి ఒక్క కొత్త ఓటర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది.
ఓటర్ ఐడి లో పేరు తండ్రి పేరు చిరునామాలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలి. ఒకవేళ చేసుకోకపోతే భవిష్యత్తులో ఐడెంటిటీ ప్రూఫ్ వాడినప్పుడు తిరస్కరించ బడుతోంది భవిష్యత్తులో అవసరమైనప్పుడు అనేక సమస్యలు ఎదురవుతాయి కాబట్టి మీ వద్దకు వచ్చే బి ఎల్ ఓ కి తప్పకుండా సహకరించి సరైన వివరాలు అందించండి.

**అప్ డేట్ చేయకపోతే :**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మీ వివరాలను నమోదు లేదా అప్డేట్ చేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన నష్టాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓటర్లు ఇప్పుడు అప్డేట్ చేయకపోతే అధికారులు మీ ప్రాంతంలో లేరు అని భావించి మీ ఓటును జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉంది. ఒకసారి ఓటర్ లిస్ట్ నుండి మీ పేరు తొలిగిపోతే ఎన్నికల రోజున మీ ప్రాంతంలో ఓటర్ కార్డు ఉన్నప్పటికీ ఓటు వేయడానికి అనుమతించదు. అదికాక ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు సంక్షేమ పథకాలు పెన్షన్లు రేషన్ కార్డు వెరిఫికేషన్ కోసం ఓటర్ జాబితాను ప్రామాణికంగా తీసుకుంటారు.

**ఆన్లైన్ ద్వారా సులువైన మార్గం:**
ముందుగా భారత ఎన్నికల సంఘం వారి ఓటర్స్ సర్వీస్ పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ సర్ ఆప్షన్ క్లిక్ చేయాలి. ఆ తర్వాత మీ రాష్ట్రం జిల్లా నియోజకవర్గం వివరాలతో పాటు మీ పేరు లేదా మీ ఎపిక్ (ఓటర్ ఐడి కార్డ్) నంబర్ నమోదు చేయాలి. వెంటనే మీకు ఓటిపి వస్తుంది దానిని ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. అయ్యాక మీ పేరు తండ్రి లేదా భర్త పేరు పుట్టిన తేదీ అడ్రస్ అన్ని కరెక్ట్ గా ఉన్నాయో లేదో సరి చేసుకోవచ్చు.

**మొబైల్ యాప్ ద్వారా :**
మీ స్మార్ట్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ నుండి ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి.



అందులో సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్ ద్వారా మీ వివరాలను చూసి తప్పులను గుర్తించి సరి చేసుకోవచ్చు. ఒకవేళ మొబైల్ వాడటం తెలియకపోతే మీ మొబైల్ నుండి ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ 1950 కి కాల్ చేసి మీ ఓటర్ ఐడి నెంబర్ చెబితే మీ వివరాల్లో ఏమైనా తప్పులు ఉన్నాయా లేదో వారు చెప్తారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



**ఖమ్మం రూరల్, జూన్ 30:(జనంసాక్షి)**
ఖమ్మం?వరంగల్ జాతీయ రహదారిపై ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.
స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం ఆచర్లగూడెం గ్రామానికి చెందిన రవితేజ (34) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం కిరాయి పనిపై ఖమ్మం వైపు వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో గొల్లగూడెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు సమాచారం.రోజువారీ కూలి చేస్తూ ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తున్న రవితేజ మృతితో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా దూరం కావడంతో ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. భర్త మృతదేహాన్ని చూసి భార్య బోరున విలపించగా, తండ్రి కోసం ఎదురుచూసిన చిన్నారుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ తనిఖీ**
మాదారిగూడెం గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారుల పనితీరును పరిశీలించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరుకు అవకాశం కల్పించేలా ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించాలని సూచించారు. పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు.ఈ తనిఖీలో మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారి రమణారెడ్డి, అనుముల తహసీల్దార్ చందర్‌రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు బిఆర్ఎస్ ఏడో వాడించార్జి చిటుపూలు శ్రీనివాసు బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామస్మరణతో కోటితలంబ్రాల జపయజ్ఞం

### కోటి తలంబ్రాల వరి విత్తనాలకు పూజలు



**భద్రాచలం జూన్ 30 (జనంసాక్షి)**
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీ కృష్ణ చైతన్య సంఘం వరి విత్తనాలకు పూజలు నిర్వహించారు. 16వ కోటి తలంబ్రాల మహా యజ్ఞంలో భాగంగా భద్రాచలం చేరుకున్న శ్రీ కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షులు కల్యాణం అప్పారావు బృందం వరి విత్తనాలకు పూజలు చేసే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబా సత్రం నుంచి శ్రీరామ నామ స్మరణల మధ్య ఆలయంకు చేరుకున్న బృందం ప్రధాన ఆలయంలో స్వామివారి ఎదుట వరి విత్తనాలను ఉంచి ప్రదక్షిణ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో స్వామి వారికి కేటాయించిన భూమిలో పంటను పండించి కోటి తలంబ్రాలు తయారు చేస్తున్నారు. వీటిని కోరుకొండలో స్వామి వారికి కేటాయించిన భూమిలో చల్లి పంటను పండిస్తారు. అనంతరం ఐదు రాష్ట్రాల్లోని సుమారు నాలుగు వేల మంది మహిళ భక్తులకు వరి ధాన్యాన్ని పంపిణీ చేస్తారు. వారంతా శ్రీరామనామ స్మరణ చేస్తూ వడ్లను ఒలిచి కోటి తలంబ్రాలను తయారు చేసి సీతారాముల కల్యాణంకు సమర్పిస్తారు.

## పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుడు మదార్ కృషి అభినందనీయం

### ఘనంగా వీడ్కోలు పలికిన సర్పంచ్ ఉపాధ్యాయులు



**మధిర, జూన్ 30 (జనంసాక్షి):**
హిందీ పండిట్ గా వృత్తిలో కొనసాగుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తుది వరకు పనిచేసిన ఉపాధ్యాయుడు షేక్ మదార్ కృషి సేవలు అభినందనీయమని ఖమ్మంపాడు సర్పంచ్ బట్ట అంజన్ బాబు అన్నారు. మంగళవారం ఆయన పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్ఎం జి రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడుకోలు సన్మాన కార్యక్రమం లో సర్పంచ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా సహచర ఉపాధ్యాయులు గ్రామస్తులు పంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున మదార్ దంపతులను దుస్సాలువలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తో పాటు సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ 29 ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో 19 ఏళ్లు గ్రామంలోని పాఠశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ఉపాధ్యాయునిగా క్రమశిక్షణకు మారు పేరుగా పిఆర్టియు సంఘం నాయకునిగా నిడారంబరతతో విమర్శరహిత బాధ్యతలను నిర్వహించి గుర్తింపు పొందారని అన్నారు. సుదీర్ఘకాలం ఖమ్మంపాడు పాఠశాలలో పనిచేసిన ఆయనవృత్తి పట్ల అంకితభావం నిబద్ధతతో పనిచేస్తూ గ్రామంలో విద్యార్థులకు మార్గదర్శక బోధనలతో వారి ఉన్నత స్థితికి ఎదిగేందుకు కృషి చేశారని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శక నిలిచిన ఆయన ఇదే పరంపరను కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా వారు పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్మన్ బంక మాణిక్యమ్మగ్రామస్థులు దిరిశాల రాము, మధుబాబుఉపాధ్యాయులు ఆర్ బ్రహ్మారెడ్డి ఎండి జమీర్ వి.లక్ష్మారెడ్డివి. లక్ష్మీప్రసన్న కే.సునీత మాజీ ప్రధానోపాధ్యాయులు ఆర్ వి సత్య నారాయణ ఉపాధ్యాయుడు మదార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నెకల్ రైతు వేదికలో సబ్సిడీ పత్తి విత్తనాల పంపిణీ

### శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలని రైతులకు అధికారుల సూచన..




**ఖమ్మం రూరల్,జూన్ 30 (జనంసాక్షి):**
ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ గ్రామ రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ (NFSNM)? 2026-27 పథకంలోని అధిక సాంద్రత విధానం (HDP)) కింద మంగళవారం సబ్సిడీపై పత్తి విత్తనాలను కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సతీష్ పంపిణి చేశారు.అర్హులైన రైతులకు సబ్సిడీ ధరలపై విత్తనాలను అందజేసి, ఆధునిక సాగు పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేయడం ద్వారా సాధారణ సాగుతో పోలిస్తే ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్ల వరకు అదనపు దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం తక్కువ ఎత్తు, పరిమిత కొమ్మలతో పెరిగే ప్రత్యేక హైబ్రిడ్ విత్తనాలను వినియోగించాలని సూచించారు. అలాగే మొక్కల శాఖీయ పెరుగుదలను సరైన సమయంలో నియంత్రించడం, సమతుల్య ఎరువుల వినియోగం, చీడపీడల సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతులకు చేరవేయడంతో పాటు ఉత్పాదకత పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం వ్యవసాయ అధికారి జె. ఉమా నగేష్, పొన్నెకల్ గ్రామ సర్పంచ్ కోటి శ్రీనివాసరావు, ఎఫ్‌టీసీ సహాయ వ్యవసాయ సంచాలకురాలు బి. వాణి, వ్యవసాయ అధికారి శరత్ బాబు, ఉద్యానవన శాఖ అధికారి అపర్ణ, ఎంపీడీఓ కె. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి తిలక్ కిషోర్, గుర్రాలపాడు, తల్లంపాడు వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హాజారిగూడెం శివాలయ చోరీ కేసును త్వరలోనే ఛేదిస్తాం

### హాలియా ఎస్సై సాయి ప్రశాంత్



**హాలియా, జూన్ 30 జనంసాక్షి:** అనుముల మండలం హజారిగూడె గ్రామంలోని శివాలయంలో జరిగిన చోరీ ఘటనను త్వరలోనే ఛేదించి నిందితులను అరెస్టు చేస్తామని హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ ఆలయ తలుపులు పగులగొట్టి సుమారు ఒక తులం బంగారు పుస్తెలు, సుమారు 500 గ్రాముల వెండి ఆభరణాలను అపహరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు, నల్గొండ క్లూస్ బృందం కూడా ఘటన స్థలాన్ని సందర్శించి శాస్త్రీయ ఆధారాలను సేకరించినట్లు వివరించారు.సంఘటన స్థలానికి వెళ్లే, వచ్చే మార్గాల్లో ఉన్న నిఘా దృశ్యాలను పరిశీలిస్తున్నామని, గతంలో ఇలాంటి నేరాలకు పాల్పడిన వారి కోణంలో కూడా విచారణ కొనసాగుతోందని తెలిపారు.ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని, కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను చట్టం ముందు నిలబెడతామని ఎస్సై సాయి ప్రశాంత్ వెల్లడించారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజం



**సూర్యాపేట(జనంసాక్షి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ దయానందరాణి, డీఈఓ అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంజడ్ ఫంక్షన్ హాల్‌లో డీటీడీవో కొమ్ము శంకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ఉద్యోగ జీవితం ముగిసినా అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు.తన ఉద్యోగ జీవితంలో నిబద్ధతతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు.ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెన్నెల, సూర్య, వినీల, వసతి గృహ సంక్షేమ అధికారులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**సూర్యాపేట (జనంసాక్షి):** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ప్రభుత్వాలు మారిన పేదల గుడిసెల బతుకులు మారట్లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనంలో జరిగిన సీపీఐ పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న పేదలు వేసుకున్న గుడిసెలకు మోక్షం కలగట్లేదని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇంటి స్థలాలు వస్తాయని ఎదురుచూస్తున్న పేద ప్రజల ఆశలు నెరవేరడం లేదన్నారు.ఎన్నికల హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కావట్లేదని, ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. వివిధ డిమాండ్లతో నేడు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, చామల అశోక్ కుమార్, రేగటి లింగయ్య, గుగులోతు రాజారాం, దికొండ శ్రీనివాస్, పెండ్ర కృష్ణ, కౌన్సిల్ సభ్యులు పొదిల వెంకటమ్మ, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శప్రాయం

### అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు

**యాదాద్రి, కరెస్పాండెంట్ జూన్ 30 (జనంసాక్షి)** నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శప్రాయం అని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అన్నారు మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు పదవీ విరమణ సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా భాస్కరావు మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు సేవలు అందించారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. నరసింహారావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సంక్షేమ శాఖ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేశారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని అదనపు కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జేపీసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి ఎంతో కృషి చేశారని, అనేక సంఘటనలలో కలిసిమెలిసి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగిందన్నారు. ముందు ముందు జీవితంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన , అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు.

## వి.బి.జి. రాంజీ బిల్లును రద్దు చేయాలి

### గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి..


### వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన




**హుజూర్‌నగర్ రూరల్, జూన్ 30 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారమైన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను వెంటనే విరమించు కోవాలని, గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న వి.బి.జి. రాంజీ బిల్లును తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోసనబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్త గ్రామీణ నిరసనలో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ,తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని అమరవరం గ్రామంలో గ్రామ పంచాయితీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చంటి కి మెమోరండం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భరోసా కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో వి.బి.జి. రాంజీ బిల్లు అమల్లోకి వస్తే గ్రామీణ ఉపాధి వ్యవస్థ మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని, పేదలు, వ్యవసాయ కార్మికులు, చిన్న రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.జులై 1న జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో కార్యాలయాల ముందు జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో గ్రామీణ కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు కూలీలు తేనె సీతారాములు, సైదులు, రాములు,మైసయ్య , సైదులు రంగయ్య, వెంకమ్మ, అనసూర్య, నాగమ్మ ,సైదమ్మ, లక్ష్మి ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## చండూరులో హోటళ్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ..

### ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే కఠిన చర్యలు:మున్సిపల్ కమిషనర్ ఎల్.మల్లేశం హెచ్చరిక



**చండూరు జూన్ 30 (జనంసాక్షి)** చండూరు పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో వంటశాలల నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీ బృందం: మున్సిపల్ కమిషనర్ ఎల్.మల్లేశం తో పాటు మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఎ. సాయి భారద్వాజ్, వార్డ్ ఆఫీసర్ బి. సాయి రాం, పర్యావరణ ఇంజనీర్ యం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు జి. మహేష్, జి. రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.?జరిమానా: నిబంధనలకు విరుద్ధంగా, పారిశుద్ధ్య లోపాలు , నాణ్యత లేని ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించిన కొన్ని రెస్టారెంట్లపై అధికారులు రూ. 12,000/- జరిమానా విధించారు.?ప్లాస్టిక్ నిషేధం: ప్రభుత్వం నిషేధించిన సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను మాత్రమే ఉపయోగించాలని కమిషనర్ స్పష్టం చేశారు.ప్రజల ఆరోగ్యం మాకు అత్యంత ముఖ్యం. హోటళ్లు, రెస్టారెంట్లు తప్పనిసరిగా శుభ్రతను పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటాం.”?చండూరు పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, మరియు ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కూడా సహకరించాలని, కేవలం శుభ్రత పాటించే హోటళ్లను మాత్రమే ప్రోత్సహించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# విచారణ చేసే అధికారులు ఎక్కడ?

◆పోలేపల్లి ఎన్ హెచ్ సీ లో జీతాల గోల్‌మాల్..?

◆ఆయా జీతం, ఏం ఎస్ అకౌంట్ నిధుల్లో అక్రమాల ఆరోపణలు..

◆సమగ్ర విచారణకు ఆ సెంటర్లో ఆయా గా పనిచేస్తున్న ఉద్యోగి డిమాండ్

◆2018 నుంచి పూర్తి జీతం అందలేదని బాధితురాలి ఆరోపణ

◆ఆర్టీఐకి 90 రోజులు గడిచినా సమాచారం లేదు.. అధికారులు మౌనం ఎందుకు?

◆ఫిర్యాదులు చేసినా విచారణ ఎక్కడ?.. జిల్లా అధికారుల తీరుపై ప్రశ్నలు

**చందంపేట, జూన్ 30 (జనం సాక్షి)**
చందంపేట మండలంలోని పోలేపల్లి ఎన్ హెచ్ సీ సెంటర్‌లో పనిచేస్తున్న ఆయా అందుగుల అంజమ్మ జీతం చెల్లింపుల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత ఏపీఎం ముడి జయప్రసాద్ పై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు.

**2018 నుంచి పూర్తి జీతం అందలేదని ఆరోపణ**
2018 నుంచి పోలేపల్లి ఎన్ హెచ్ సీ. సెంటర్‌లో ఆయాగా పనిచేస్తున్న అందుగుల అంజమ్మకు ప్రారంభంలో నెలకు రూ.4,000 జీతం మంజూరైనా, తనకు కేవలం రూ.2,000 మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తాన్ని పక్కదారి పట్టించారని ఆమె ఆరోపించారు. అనంతరం మూడు నుంచి నాలుగు సంవత్సరాల పాటు పూర్తి జీతం ఇవ్వలేదని తెలిపారు. 2026 జనవరి నుంచి జీతం రూ.7,000కు పెరిగిన తర్వాత కూడా చెక్కుల ద్వారా నగదు డ్రా చేసినప్పటికీ తనకు ఒక్క రూపాయి కూడా అందలేదని ఆమె పేర్కొన్నారు.

**ఏం ఎస్ అకౌంట్ నుంచి రూ.4 లక్షలకు పైగా విత్‌డ్రా చేశారనే ఆరోపణ**
స్కూలు అద్దె, ఆటో డ్రైవర్, మెయింటెనెన్స్, సామగ్రి కొనుగోలు వంటి పేర్లతో ఏం ఎస్ అకౌంట్ నుంచి సుమారు రూ.4 లక్షలకు పైగా నగదు విత్‌డ్రా చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తున్నారు . ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ ప్రారంభం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.




**ఆర్టీఐకి 90 రోజులు.. సమాచారం ఇవ్వడంలో జాప్యం ఎందుకు?**
ఏం ఎస్ అకౌంట్ స్టేట్‌మెంట్ కోసం సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కింద దరఖాస్తు చేసి 90 రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి లిఖితపూర్వక సమాచారం అందలేదని బాధితురాలు తెలిపారు. దీంతో అకౌంట్ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆమె పేర్కొన్నారు.



**ఫిర్యాదులు చేసినా విచారణ ఏమైంది?.. అధికారులపై ప్రశ్నలు**
బాధితురాలు జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు విచారణ ప్రారంభం కాకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ఆరోపణలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ చేపట్టి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
తనకు రావాల్సిన జీతం చెల్లించకుండా పక్కదారి పట్టించారని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం పై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారించిన అనంతరం తప్పు చేసిన వారిపై చట్టపరమైన, చర్యలు తీసుకోవాలని బాధితురాలు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

**ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల జీతాలా?**
వెలుగు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ జీతం పొందుతున్న మాతంగి ఎల్లమ్మ పేరుతోనే పోలేపల్లి ఎన్ హెచ్ సీ. సెంటర్‌లో కూడా సుమారు రూ.60 వేల మేర జీతం చెల్లింపులు జరిగినట్లు గుర్తించామని బాధితురాలు అందుగుల అంజమ్మ ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపీఎం) రామలింగయ్య దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు ప్రభుత్వ కార్యాలయాల్లో జీతాలు నమోదు కావడం తీవ్రమైన అవకతవకలకు సంకేతమని, దీనిపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి



వస్తాయని ఆమె పేర్కొన్నారు. పోలేపల్లి ఎన్ హెచ్ సీ సెంటర్‌లో ఎల్లమ్మ పేరుతో నమోదైన జీతం ఆమెకు అందలేదని, ఈ వ్యవహారంలో సంబంధిత చందంపేట ఏపీఎం ముడి జయప్రసాద్ వారి జీతాలను దారి మళ్లించారాని.వారి పై పూర్తి స్థాయి విచారణ జరిపి, చట్టపరమైన, చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను బాధితురాలు డిమాండ్ చేస్తున్నారు.





## రైతు భరోసా నిధులు విడుదల సింగారం రైతు వేదికలో వీక్షిస్తున్న రైతులు అధికారులు

**నూతనకల్ జూన్ 30(జనంసాక్షి)**
మండల పరిధిలోని తాళ్లసింగారం రైతు వేదికలో మంగళవారం రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమంలో వీక్షిస్తున్న అధికారులు, రైతులు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి రైతు భరోసా నిధులను ప్రారంభించిన కార్యక్రమాన్ని మండలంలోని తాళ్లసింగారం రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఏఎంసీ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, ఏవో సైదా నాయక్, సర్పంచ్ జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్ వివిధ గ్రామాల రైతులు, ఏఈఓ లు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నదని, ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని రైతులు వ్యవసాయ అవసరాలకే వినియోగించుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఈ పథకాన్ని అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాల సంఘం చైర్మన్ గా శ్రీనివాస్



**వలిగొండ, జూన్ 30 (జనంసాక్షి)**
మండలంలోని మొగిలిపాకలో మంగళవారం పాలఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యులు నిర్వహించిన సమావేశంలొ ఎన్నికలు నిర్వహించగా బి ఆర్ ఎస్ పార్టీకి చెందినవారిని చైర్మన్ గా అమిర్శెట్టి శ్రీనివాస్ ను డైరెక్టర్లుగా జడిగే మల్లయ్య,సింగం మహేష్ గార్లను ఏకిగ్రీవంగా ఎన్నికున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్, షేక్ సైదులు,బీమనబోయిన బిక్షపతి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పనకబండ గ్రామ సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం

**మోత్కూరు జూన్ 30 (జనం సాక్షి)**
పనకబండ గ్రామ ప్రతినిధులు కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో చాలా



కాలంగా నెలకొన్న ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వాటర్ పైప్‌లైన్ సౌకర్యాల కొరత, వీధి దీపాల సమస్యల గురించి మంత్రికి వివరించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి, సాధ్యమైన మేరకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధార మల్లేశం, లోతుకుంట అనిల్ కుమార్, నల్లబోగుల వెంకన్న, బత్తిని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్' పై అవగాహన కార్యక్రమం

**అడ్డగూడూర్/జూన్ 30(జనం సాక్షి )**
స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ మరియు మహిత చైల్డ్ రైట్స్ ఫర్ అలయన్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళవారం రోజున అడ్డగూడూర్ మండల కేంద్రంలోని కేజీబీవి యందు 'గుడ్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర



అభివృద్ధి లక్ష్యాలలో భాగమైన ఎస్‌డిజి-3 'మంచి ఆరోగ్యం మరియు సంక్షేమం' గురించి విద్యార్థులకు వివరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. "స్కోప్" మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య మాట్లాడుతూ.... కౌమారదశలో వచ్చే మార్పులు, బాల్యంలో పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, క్రీడలు, తగినంత నిద్ర, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఒత్తిడిని ఎలా నిర్వహించుకోవాలి, స్నేహితులతో, కుటుంబ సభ్యులతో స్వేచ్ఛగా మాట్లాడడం వంటి విషయాలను వివరించారు. ఈ సందర్భంగా స్కోప్ ప్రతినిధులు మాట్లాడుతూ, "చిన్న వయసు నుండే ఆరోగ్య అలవాట్లు అలవాటు చేసుకుంటే, వారు ఆరోగ్యకరమైన పౌరులుగా ఎదుగుతారు. చైల్డ్ రైట్స్ ఫర్ అలయన్స్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన జీవనం అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. అలాగే స్కోప్ సంస్థ వారు బాల్య వివాహాలు జిల్లా వ్యాప్త నిర్మూలన కోసం బాల్య వివాహ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఐఈఓ పాఠశాల/ జూనియర్ కళాశాల ఇన్చార్జి ఏ.సరిత గఅధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన స్కోప్, మహిత మరియు చైల్డ్ రైట్స్ ఫర్ అలయన్స్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులలో మంచి మార్పు తెస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో వి మహేశ్వరి పీజీసీఆర్టీ (కెమిస్ట్రీ), విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.